రోడ్డుపైనే మురుగు.. జనం బేజారు..!

- రసూల్‌పురా 105 గల్లీలో రోడ్డుపై పారుతున్న మురుగు
- ఆరు నెలలుగా ఇదే పరిస్థితి
- పట్టించుకోని బోర్డు అధికారులు



రసూల్‌పురా 105 గల్లీలో రోడ్డుపైనే పారుతున్న మురుగు నీరు

కంటోన్మెంట్, జూన్ 7: కంటోన్మెంట్ బోర్డు పరిధిలోని రెండో వార్డు రసూల్‌పురా 105 గల్లీ ఏర్పడి దశాబ్దాలు గడుస్తున్నా అభివృద్ధికి మాత్రం ఆమడ దూరంలో ఉంది. ఈ ప్రాంతంలో నివసించేది నిరుపేద కుటుంబాలే.. చిన్న చిన్న పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నారు. అక్కడి వారికి మురుగు సమస్య తలనొప్పిగా మారింది. ఈ కాలనీలో భూగర్భ డ్రైనేజీ వ్యవస్థ లేకపోవడంతో ఇళ్లల్లో నుంచి వచ్చే మురుగు రోడ్డుపైనే ప్రవహిస్తోంది. ఇంకుడు గుంతలు సైతం నిండిపోయాయి. దీంతో మురుగు దిగువ ప్రాంతానికి వస్తుండడంతో ఆ ప్రాంత ప్రజలు ఎగువ ప్రాంతం వారిపై గొడవలకు దిగుతున్నారు. అంతేకాకుండా ఈగలు, దోమలు స్వైరవిహారం చేస్తున్నాయి. ఇటీవల కాలంలో గల్లీలో సీసీ రోడ్డు వేసినా డ్రైనేజీ పైపులైన్ సరిగా లేకపోవడంతో పారిశుద్ధ్యం లోపించింది. దీంతో సీసీ రోడ్డుపైనే మురుగు నీరు నిలుస్తోంది. వాహనాలు వెళ్లే సమయంలో మురుగు పాదచారులపై పడుతోంది. నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని బస్తీ వాసులు వాపోతున్నారు. ఇదేదో మారుమూల ప్రాంతం కాదు.. కొత్తగా ఏర్పడిన కాలనీ అనుకుంటే పొరపాటే.. కానీ అభివృద్ధి జాడ మచ్చుకైనా కనిపించదు.. నగరం నడిబొడ్డున కంటోన్మెంట్ పరిధిలోని రసూల్‌పురా 105 గల్లీ ఏర్పడి దశాబ్దాలు గడిచినా ఇప్పటికీ రోడ్లపైనే మురుగు ప్రవహించడం గమనార్హం. డ్రైనేజీ వ్యవస్థ లేక మురుగు వీధుల్లో ప్రవహిస్తోంది. రోడ్లపైనే మురుగు పారుతున్నా అధికారుల్లో కదలిక లేదు.

బోర్డు అధికారులు పట్టించుకోవాలి

సీసీ రోడ్డు వేసే సమయంలోనే డ్రైనేజీ సక్రమంగా ఉందా.. లేదా అన్న విషయాన్ని బోర్డు అధికారులు గమనించకపోవడం శోచనీయం. దీంతో మురుగు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో జనాలు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులకు ఎన్నిసార్లు విన్నవించినా పట్టించుకోవడం లేదు. జనం మురుగు నీరు కారణంగా వ్యాధుల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా బోర్డు అధికారులతో పాటు నూతనంగా ఎమ్మెల్యేగా ఎన్నికైన శ్రీగణేష్ అయినా పట్టించుకోని సమస్యకు పరిష్కారం చూపాలి.

– షేక్ నయూం, మాజీ డైరెక్టర్, బోయిన్‌పల్లి మార్కెట్

కంటోన్మెంట్ ఎమ్మెల్యేగా విజయం సాధించిన అనంతరం మొదటి సారిగా ఎమ్మెల్యే శ్రీ గణేష్ గాంధీ భవన్‌కి వెళ్లారు.శుక్రవారం టీపీసీసీ ఇన్‌చార్జి దీపాదాస్ మున్షీ, మునుగోడు ఎమ్మెల్యే రాజ్‌గోపాల్ రెడ్డిని మర్యాద పూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించారు. –కంటోన్మెంట్,జూన్ 7:

లేబర్ కార్డు ఉన్నవారికి ఉచిత వైద్య శిబిరం

కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

అడ్డగుట్ట, జూన్ 7 : లేబర్ కార్డు ఉన్నవారందరూ ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ కిశోర్ తెలిపారు. శుక్రవారం అడ్డగుట్ట ఐద్వా కార్యాలయంలో లేబర్ కార్డు కలిగి ఉన్నవారికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించిన అనంతరం మందులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సుమారు 80 మంది కార్మికులు వైద్య శిబిరంలో పాల్గొని వివిధ రకాల పరీక్షలు చేయించుకోవడం జరిగింది. వచ్చే వారం కూడా వైద్య శిబిరం ఉంటుందని, లేబర్ కార్డులు ఉన్నవారు తప్పనిసరిగా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని వైద్యులు సూచించారు. ఒకవేళ కార్డు లేనివారు వెంటనే నూతన కార్డు చేయించుకోవాలని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు అజయ్‌బాబు, ఫాతిమా, స్వరూప, రాజన్న, యాదగిరితో పాటు తదితరులు పాల్గొన్నారు.

వివిధ కోర్సులకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7: ఉస్మానియా యూనివర్సిటీ క్యాంపస్‌లోని దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ కాలేజ్ ఆఫ్ ఫైన్‌ఆర్ట్స్ అండ్ మీడియా ఎడ్యుకేషన్ (డీడీఎంఎస్ కోఫేమ్)లో వివిధ కోర్సులకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు కళాశాల చైర్‌పర్సన్ డాక్టర్ రమాప్రభ, ప్రిన్సిపాల్ కె. విజయ తెలిపారు. ఈ మేరకు వారు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రస్తుత విద్యాసంవత్సరంలో ఈ కోర్సులను అందించనున్నట్లు చెప్పారు. బీఏ కర్ణాటక సంగీతం (ఫుల్ టైం), ఎంఏ కర్ణాటక సంగీతం (పార్ట్ టైం ఇన్ డిస్టెన్స్ ఎడ్యుకేషన్) కోర్సులలో చేరేందుకు కేవలం మహిళలే అర్హులని పేర్కొన్నారు. కర్ణాటక వోకల్‌లో ఒక సంవత్సరం బ్రిడ్జి కోర్సు, డెవోషనల్ మ్యూజిక్ (సంకీర్తన)లో ఆరు వారాల సర్టిఫికెట్ కోర్సు, వీణ, వయోలిన్, కీబోర్డ్, ఫ్లూట్‌లలో ఒక సంవత్సరం సర్టిఫికెట్ కోర్సు, సౌందర్య లహరి, ఆర్‌జే, వాయిస్ ఓవర్, యాక్టింగ్, యాంకరింగ్, న్యూస్ రీడింగ్, రిపోర్టింగ్, ఎడిటింగ్, డబ్బింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్‌లో సర్టిఫికెట్ కోర్సు, టెక్చర్ ఆర్ట్, రెసిన్ ఆర్ట్, లిప్పన్ ఆర్ట్, క్యాండిల్ మేకింగ్, తంజావూర్ పెయింటింగ్, కార్టూనింగ్, డాల్స్ మేకింగ్, క్రోచెట్, స్టోరీ టెల్లింగ్ విత్ ఫ్లాష్ కార్డ్స్, బ్యూటీషియన్, హెయిర్ స్టైల్స్, కౌన్సెలింగ్ ఫర్ చిల్డ్రెన్ అవేర్‌నెస్ తదితర అంశాల్లో సర్టిఫికెట్ కోర్సులను అందిస్తున్నట్లు చెప్పారు. ఈ అన్ని కోర్సుల్లో చేరేందుకు మహిళలతో పాటు పురుషులు కూడా అర్హులని వివరించారు. ఈ నెల 20లోగా దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఇతర వివరాలకు 9441768811, 9393949415 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

విమర్శనా రచనకు ఆధ్యుడు ప్రభాకర శాస్త్రి

ముషీరాబాద్: చిక్కడపల్లి త్యాగరాయ గాన సభలో జరుగుతున్న శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో భాగంగా శుక్రవారం కవి, చరిత్రకారుడు వేటూరి ప్రభాకరశాస్త్రి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో బేవరేజస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ జీ దేవీప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ప్రభాకర శాస్త్రి చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గాన సభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది.

ఫిర్యాదుదారులకు సెల్‌ఫోన్లు అందజేస్తున్న ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి



ఇన్‌స్పెక్టర్ చేతుల మీదుగా రివార్డును అందుకుంటున్న మహిళా పీసీ గౌతమి

సీఈఐఆర్ విధానం ద్వారా సెల్ ఫోన్లు రికవరీ

అమీర్‌పేట్, జూన్ 7 : సీఈఐఆర్ విధానం ద్వారా సనత్‌నగర్ పోలీసులు పెద్దఎత్తున సెల్ ఫోన్లు రికవరీ చేశారు. గత సంవత్సరం ఏప్రిల్ నుంచి తమ సెల్‌ఫోన్లు పోయాయంటూ పీఎస్‌లో ఫిర్యాదు చేసిన వారివి దాదాపు 90 మొబైల్ ఫోన్లను రికవరీ చేశారు. కొద్ది రోజులుగా దాదాపు 73 రికవరీ చేసిన సెల్‌ఫోన్లు ఫిర్యాదు దారులకు అందజేశారు. తాజాగా శుక్రవారం మరో 17 సెల్‌ఫోన్లను సనత్‌నగర్ పీఎస్‌లో ఇన్‌స్పెక్టర్ పురేందర్ రెడ్డి, డీఐ నాగిరెడ్డితో కలిసి ఎవరికి వారికి అందజేశారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి మాట్లాడుతూ గత సంవత్సరం ఏప్రిల్ నుంచి చోరీకి గురైన సెల్‌ఫోన్ల ఫిర్యాదులపై సీఈఐఆర్ విధానంతో ఫోన్లను ఆయా ఐఎంఈఐ నెంబర్లపై ట్రాకింగ్ చేయడం జరిగిందని తెలిపారు. ఈ ట్రాకింగ్‌తో చోరీకి గురైన సెల్‌ఫోన్ నుంచి సిమ్ కార్డు మార్చి వేరే సిమ్ కార్డు వేసిన వెంటనే ట్రాకింగ్ ఉన్న పోలీసులతో పాటు, పాత సిమ్ యజమానికి మెసేజ్ వెళ్తున్నదని, ఆ విధంగా సీఈఐఆర్ విధానం ద్వారా ఇప్పటివరకు 90 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకోవడం జరిగిందని తెలిపారు. ఎప్పటికప్పుడు రికవరీ అవుతున్న ఫోన్లను ఫిర్యాదు దారులకు అందజేస్తూ వస్తున్నామని, తాజాగా 17 సెల్ ఫోన్లను శుక్రవారం పీఎస్‌లో అందజేయడం జరిగిందని తెలిపారు.

మహిళా పీసీకి రివార్డు

చోరీకి గురైన సెల్ ఫోన్లను ట్రాకింగ్ చేయడంలో చురుగ్గా వ్యవహరించిన సనత్‌నగర్ మహిళా పీసీ గౌతమిని ఇన్‌స్పెక్టర్ పురేందర్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు పీఎస్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో గౌతమికి రివార్డును అందజేశారు. సీఈఐఆర్ విధానాన్ని సమర్థవంతంగా వినియోగిస్తూ చోరీకి గురైన సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకోవడంలో గౌతమి కృషిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో డీఎస్ఐ అరుణ్‌కుమార్, పీసీలు శేఖర్, బాలకృష్ణ, ఇబ్రహీమ్ తదితరులు పాల్గొన్నారు.

జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న పేరు

హర్షం వ్యక్తం చేసిన గౌడ కులస్తులు

సీఎం రేవంత్‌రెడ్డికి సర్వాయి పాపన్న పుస్తకాన్ని బహూకరిస్తున్న జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర్ వట్టికూటి రామారావుగౌడ్

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 7: జనగామ జిల్లాకు సర్దార్ సర్వాయి పాపన్న మహారాజ్ జిల్లాగా నామకరణం చేసేందుకు ఏర్పాట్లు చేస్తున్నందుకు సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి జైగౌడ్ ఉద్యమం జాతీయ అధ్యక్షుడు డాక్టర వట్టికూటి రామారావుగౌడ్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా రామారావుగౌడ్ మాట్లాడుతూ.. పాపన్న పేరును జిల్లాకు పెడతామని కాంగ్రెస్ పార్టీ తన ఎన్నికల మేనిఫెస్టోలో చేసిన వాగ్దానాన్ని నెరవేర్చే దిశగా చర్యలు తీసుకుంటున్నందుకు లక్షలాది గౌడ్ కులస్తుల తరపున ధన్యవాదాలు తెలుపుతున్నట్లు చెప్పారు. రాష్ట్రంలో గీతకార్మికుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రథమ ప్రాధాన్యం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో జి. రామన్ గౌడ్, టీపీసీసీ కార్యదర్శి మధు, సత్యంగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

కులగణన చేపట్టి.. బీసీ రిజర్వేషన్లు పెంచాలి

సమావేశంలో మాట్లాడుతున్న ఎర్ర సత్యనారాయణ

ముషీరాబాద్, జూన్ 7: బీసీ కులగణనకు అనుకూలమంటూ జేడీయూ చేసిన ప్రకటనను స్వాగతిస్తున్నామని, అదే దారిలో ఎన్డీలో కీలక భాగస్వామి టీడీపీ నడుచుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ అన్నారు. అధికారంలోకి వచ్చిన ఎన్డీయే ప్రభుత్వం కులగణన చేపట్టి రిజర్వేషన్లను పెంచాలని డిమాం డ్ చేశారు. శుక్రవారం విద్యానగర్‌లోని బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఈ నెల 23న నగరంలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో బీసీ సంఘం రాష్ట్ర సర్వసభ్య కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించ తలపెట్టినట్లు తెలిపారు. కులగణన చేసి బీసీ రిజర్వేషన్‌లు పెంచిన తరువాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నాయకులు గుజ్జ కృష్ణ, మల్లేశ్‌యాదవ్, నీల వెంకటేశ్, సుధాకర్, రాజ్‌కుమార్, రామకృష్ణ, అనంతయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

నాంపల్లి కోర్టులు, నమస్తే తెలంగాణ : నాంపల్లి కోర్టుల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న జాతీయ లోక్ అదాలత్‌లో అధిక కేసుల పరిష్కారానికి న్యాయవాదులు సహకరించాలని కార్యదర్శి అరుణకుమారి కోరారు. బార్ అసోసియేషన్ హాలులో శుక్రవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులకు నచ్చజెప్పి కేసుల పరిష్కారానికి దొహదపడాలని అన్నారు. సికింద్రాబాద్, మనోరంజన్, నాంపల్లి కోర్టుల్లోని అన్ని కోర్టులలో ఆమోదయోగ్యమైన కేసులను తొలగించేందుకు చేయూతనందించాలన్నారు. చెక్ బౌన్స్, వివాహ సంబంధ, రోడ్డు ప్రమాదాలు, ఎక్సైజ్, సివిల్ తగాదాలు, తదితర కేసుల్లో రాజీ చేసుకునే వీలున్న కేసులను తొలగించుకునేందుకు ఇరువర్గాలకు చెందిన కక్షిదారుల్ని ఒప్పించేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. న్యాయవాదుల కోసం ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంప్ ఉపయుక్తంగా ఉందని అన్నారు. ఈ కార్యక్రమంలో అధ్యక్షుడు రాజ్యవర్ధన్‌రెడ్డి, వైద్యులు, న్యాయవాదులు పాల్గొన్నారు

బోయిగూడలోని ఉప్పలమ్మ గుడి పక్క వీధిలో రోడ్డు దుస్థితి చూపిస్తున్న మహిళలు

వీధి ఇట్ల..పోయేదెట్ల..!

అంతర్గత రోడ్ల ప్యాచ్ వర్క్ వదిలేశారు

బన్సీలాల్‌పేట్, జూన్ 7 : న్యూబోయిగూడలోని ఉప్పలమ్మ దేవాలయం పక్క వీధిలో అంతర్గత రోడ్లలో ప్యాచ్ వర్క్ చేయకుండా వదిలేశారని స్థానికులు ఫిర్యాదు చేశారు. జలమండలి శాఖ ఆధ్వర్యంలో ఆరు నెలల క్రితం ఈ వీధిలో డ్రైనేజీ పైపు లైన్లు వేశారు. ఆ వెంటనే జీహెచ్ఎంసీ ఇంజినీరింగ్ సిబ్బంది ప్యాచ్ వర్క్ వేయాలి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఆరు నెలల నుంచి ప్యాచ్ వేయకపోవడంతో మట్టి కొట్టుకుపోయి రాళ్ళు తేలాయి. బస్తీవాసుల రాకపోకలకు ఇబ్బందిగా మారింది. వాన పడితే మట్టి మొత్తం బురదమయంగా మారి డ్రైనేజీలోకి వెళ్తున్నదని, వరద నీరు ఒకేచోట నిలిచిపోతున్నదని స్థానిక మహిళలు తెలిపారు. ఇప్పటికైనా జీహెచ్ఎంసీ అధికారులు తమ వీధిలో రోడ్డు ప్యాచ్ వర్క్ పనులు పూర్తి చేయాలని వారు కోరారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

మారేడ్‌పల్లి, జూన్ 7:రైల్లోంచి ప్రమాదవ శాత్తు జారి పడి గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బొల్లారం ,కెవెల్లరీ బ్యారక్స్– అల్వాల్ రైల్వే స్టేషన్ల మధ్య గుర్తు తెలియని వ్యక్తి మెడ్చల్ నుంచి సికింద్రాబాద్ కు వెళ్లే ఎంఎంటీఎస్ రైల్లోంచి ప్రమాదవశాత్తు జారి కిందపడి మృతి చెందాడు. సమాచారం అందుకున్న రైల్వే పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని గాంధీ మార్చురీకి తరలించారు. మృతుడి ఒంటిపై బ్లూ కలర్ చొక్కా, బ్లూ కలర్ జీన్స్ ప్యాంట్ ధరించి ఉన్నట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

వైద్య విద్యార్థులకు ట్రాఫిక్‌పై అవగాహన

సురక్షితంగా తమ గమ్యస్థానాలకు చేరుకునేందుకు వాహనదారులు మితిమీరిన వేగంతో ప్రయాణించడం అనర్థాలకు దారి తీస్తుందని బేగంపేట్ టీటీఐ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. సనత్‌నగర్‌లోని ఈఎస్ఐసీ వైద్య విద్యార్థులకు రోడ్లపై వాహనదారులు అనుసరించాల్సిన ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించారు. ఈ అవగాహన శిబిరంలో దాదాపు 400 మంది విద్యార్థులు, ఈఎస్ఐసీ వైద్య కళాశాల ఇన్‌చార్జి డీన్ ప్రొ. నీతా లక్ష్మి, ఈఎస్ఐసీ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి ఎంఎస్ డాక్టర్ ఎం.రాధిక పాల్గొన్నారు. – అమీర్‌పేట్, జూన్ 7 :

ఎగ్జిబిషన్ సెంటర్‌లో హెచ్‌జేఎఫ్ ఎక్స్‌పో ప్రారంభం

ఎక్స్ పోను ప్రారంభిస్తున్న జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఐపీఎస్ పరిమళ హనా

మాదాపూర్, జూన్ 7: మాదాపూర్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో ఇన్‌ఫార్మా మార్కెట్స్ ఇండియా ఆధ్వర్యంలో హెచ్‌జేఎఫ్ (హైదరాబాద్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్) ను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ కమిషనర్ ఆఫ్ పోలీస్ అడ్మినిస్ట్రేషన్, ఐపీఎస్ పరిమళ హనా విచ్చేసి హెచ్‌జేఎంఏ అధ్యక్షుడు మహేందర్ తాయల్, జంట నగరాల జ్యువెలరీ అసోసియేషన్ అధ్యక్షుడు కైలాశ్ చరణ్, తెలంగాణ బులియన్, జెమ్ అండ్ జ్యువెల్లరీ ఫెడరేషన్ అధ్యక్షుడు జగదీష్ పర్వద్ వర్మ, తెలంగాణ పాన్ బ్రోకర్ జ్యువెలర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరస్మల్ రాంకా, పాట్ మార్కెట్స్ జ్యువెలర్స్ అసోసియేషన్ అశోక్ ఫెర్మల్ జైన్, ఇన్ఫార్మా మార్కెట్స్ మేనేజింగ్ డైరెక్టర్ యోగేశ్ ముద్రాస్‌లతో పాటు పలువురితో కలిసి జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన సాంస్కృతిక వారసత్వంలో ఆభరణాల పాత్ర కీలకమన్నారు. రత్నాలు, ఆభరణాల పరిశ్రమ వినియోగం, ఎగుమతి రెండింటిలోను కీలకపాత్ర పోషిస్తుందన్నారు. హైదరాబాద్ ఫెయిర్ జ్యువెలరీ పెరల్ అండ్ జెమ్ ఫెయిర్ వంటి ఈవెంట్‌ల రంగంలో భారతదేశం నైపుణ్యాన్ని బహిర్గతం చేసే దిశగా ముందంజలో ఉన్నట్లు చెప్పారు.

2030 నాటికి 75 యుఎస్‌డీ బిలియన్ల (రూ. 6.2 లక్షల కోట్లు) రత్నాలు, ఆభరణాల ఎగుమతి లక్ష్యాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా 350 మంది ఎగ్జిబిటర్లు, 750కి పైగా బ్రాండ్‌లను ప్రదర్శించడం జరిగింది. 2 లక్షలకు పైగా సరికొత్త డిజైన్‌లు 8 వేల మంది వాణిజ్య కొనుగోలుదారులను ఆకర్షించనున్నాయన్నారు.

గోవధ శాలలను తక్షణమే మూసివేయాలి

కవాడిగూడ, జూన్ 7: రాష్ట్రంలో చట్ట విరుద్ధంగా కొనసాగుతున్న గోవధ శాలలను తక్షణమే మూసివేయాలని తెలంగాణ రాష్ట్ర గోరక్ష సహ ప్రముఖ్ జి. రమేశ్, ఇసంపల్లి వెంకన్న, విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శాలివాహన పండరీనాథ్, కన్వీనర్ శివరామ్, బాలకృష్ణ గురుస్వామి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆక్రమణలో ఉన్న గోచర భూములను విముక్తి చేసి ప్రతి జిల్లాలో రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గోషాలలను ఏర్పాటు చేయాలని శుక్రవారం వారు విజ్ఞప్తి చేశారు.

IN THE COURT OF IIIrd SENIOR CIVIL JUDGE CITY CIVIL COURT, SECUNDERABAD
Succession. OP No. 14 OF 2024
(In the matter of Indian Succession Act)
BETWEEN:
M.Jyothi, w/o Late M Devaraj, aged about 50 years, H.No: 2-5-6, Kattakindi Basti, Sikh Village, VTC, Secunderabad, 500009.
....PETITIONER
AND
Hyderabad Metropolitan Water Supply and Sewage Board,Rep by: General Manager (Engineer, O&M Div VII, HMWSSB, Maredpally, Secunderabad.
....RESPONDENT
To,
All concerned
The general public hereby informed that M.Jyothi have filed petition for succession certificate of legal heirs of deceased A.Lalita. The case is posted on 18.06.2024 for calling objections if any from general public. They may appear and file objections if any on 18.06.2024 at 10.30 A.M before the Hon'ble III Senior Civil Judge City Civil Court, at Secunderabad filing which the matter will be decided on the material available.
(By the order of Hon'ble court)
D. DHANA LAKSHMI, Advocate
Plot No.57, Balaji Enclave, Transport Road, Sikh Village, Secunderabad-500009
dhanalakshmi31071988@gmail.com
Phone no. 7815856152

బీసీల సంక్షేమం కోసం చర్యలు తీసుకోవాలి

బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్

హిమాయత్‌నగర్, జూన్ 7: రాష్ట్రంలోని బీసీల సంక్షేమం, అభ్యున్నతి కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తగిన చర్యలు తీసుకోవాలని తెలంగాణ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల నరేందర్ గౌడ్ డిమాండ్ చేశారు. హిమాయత్‌నగర్‌లోని సంఘం రాష్ట్ర కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. బీసీలు సామాజిక, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో ఎదిగేందుకు ప్రభుత్వాలు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. బీసీలకు అన్ని రంగాల్లో తీరని అన్యాయం జరుగుతుందని చట్ట సభల్లో బీసీలకు యాభై శాతం రిజర్వేషన్లు అమలు చేసేందుకు కేంద్రం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

బంజారాహిల్స్‌లో చోరీ

– వ్యాపారి ఇంట్లో 70 తులాల బంగారం మాయం

బంజారాహిల్స్, జూన్ 7: బంజారాహిల్స్‌లోని ఓ వ్యాపారి ఇం ట్లో భారీ చోరీ జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్ రోడ్ నం. 8లో నివాసం ఉంటున్న గోపాల్‌దాస్ అగర్వాల్ వ్యాపారి. నెలరోజుల కిందట కుటుంబ సభ్యులు సుమారు 70 తులాల బం గారు ఆభరణాలు, బిస్కెట్లు ఇంట్లోని అల్మారాలో దాచారు. బిస్కెట్ల లో కొన్నింటిని కరిగించి నెక్లెస్‌లు, గాజులు, ఇతర వస్తువులు తయా రు చేయించారు. వాటిని బెడ్‌రూమ్‌లోని అల్మారాలో దాచి ఉంచా రు. కాగా, ఫంక్షన్‌కు వెళ్లేందుకు గోపాల్‌దాస్ కుటుంబసభ్యులు సిద్ధమవుతున్న క్రమంలో అల్మారాలోని ఆభరణాల కోసం చూడగా అవి కనిపించలేదు. నెల రోజుల కిందట అల్మారాలో దాచిన ఆభరణాలు మాయం కావడంలో ఇంట్లో పని చేస్తున్న పని మనుషుల పాత్ర ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేస్తూ గురువారం రాత్రి గోపాల్‌దాస్ అగర్వాల్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఇంట్లో పని చేస్తున్న నలుగురు పని మనుషులను పోలీసులు అదుపులోకి తీసుకొని విచారిస్తున్నారు.